సాక్షి
హనుమకొండ
మంగళవారం । 16 । ఏప్రిల్ । 2024



క్రమబద్ధీకరణపై కనికరమేది?
ప్రభుత్వ వైద్యారోగ్య విభాగం నేషనల్ హెల్త్ మిషన్ స్కీమ్‌లో సేవలందిస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.
- 8లో ▸



పోలీస్‌స్టేషన్‌లో ఆటాపాట - 8లో ▸
ఓ సినిమా పాటకు అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి భర్త ఏకంగా పోలీస్‌స్టేషన్‌లోనే స్టెప్పులేశాడు. ఈఘటన భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ పీఎస్‌లో చోటు చేసుకుంది.

గరిష్టం/కనిష్టం
$41^0/26^0$
వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

టూరిజం కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

హన్మకొండ: హైదరాబాద్ గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్)లో టూరిజం కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ ఆమోదిత కళాశాల నిథమ్‌లో ఇంటర్, డిగ్రీలో బీఎస్సీ, బీబీఏ, ఎంబీఏ కోర్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోర్సులు పూర్తి చేసిన అనంతరం విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు ఉంటాయని, దేశంలోని హాస్పిటాలిటీ ఇండస్ట్రీలో ఉపాధి అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. జాతీయ స్థాయి విద్యా విధానంతో నిథమ్ ఉన్నత ప్రమాణాలతో కోర్సులు అందిస్తుందని పేర్కొన్నారు. అడ్మిషన్, ఇతర వివరాలకు హనుమకొండ కలెక్టరేట్‌లోని జిల్లా పర్యాటక శాఖ కార్యాలయంలో నేరుగా సంప్రదించవచ్చని, లేదా పూర్తి వివరాలకు 94408 16076, 98669 19131 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

డిగ్రీ పరీక్షలు ప్రారంభం



కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల 2, 4, 6 సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించారు. ఈ పరీక్షల నిర్వహణ తీరును ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి పర్యవేక్షించారు. మే 8 వరకు పరీక్షలు కొనసాగుతాయి.


మే1 నుంచి వేసవి క్రీడా శిబిరాలు

వరంగల్ స్పోర్ట్స్: తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాలతో మే 1 నుంచి 31 వరకు హనుమకొండ జిల్లా పరిధి గ్రామీణ క్రీడా ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌ఓ అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజుల పాటు శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు పీడీ, పీఈటీ, సీనియర్ క్రీడాకారులు అర్హులుగా పేర్కొన్నారు. శిబిరాల నిర్వహణకు ఆసక్తి అర్హత కలిగిన వారు ఈనెల 16 నుంచి 23వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నెల రోజుల పాటు కొనసాగే ఈశిబిరంలో ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రాంతంలో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో డీఎస్‌ఏ కోచ్‌ల ద్వారా శిక్షణ శిబిరాలు కొనసాగుతాయని తెలిపారు. వేసవి సెలవులను వృథా చేయకుండా వివిధ క్రీడాంశాల్లో శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి కలిగిన బాలబాలికలు ఈ నెల 16 నుంచి 25వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు హనుమకొండలోని ఇండోర్ స్టేడియంలోని డీఎస్‌ఏ ఆఫీస్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పేర్ల నమోదుకు ఆధార్ కార్డు, బోనోఫైడ్ సర్టిఫికెట్ జిరాక్స్‌లను తీసుకు రావాలని సూచించారు. ఇతర వివరాలకు అథ్లెట్ కోచ్ 94410 86556 మొబైల్ నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎస్‌ఏ-2 పరీక్షలు షురూ

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ-2) పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. 1 నుంచి 9వతగతి విద్యార్థులకు తొలి రోజు తెలుగు, ఉర్దూ సబ్జెక్టుల పరీక్షలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ రాంపూర్‌లోని హైస్కూల్‌లో నిర్వహిస్తున్న పరీక్షలను పరిశీలించారు. ఈనెల 22 వరకు పరీక్షలు జరుగుతాయని సంబంధిత అధికారులు తెలిపారు.

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



కమలాపూర్: కమలాపూర్ మండలం అంబాలలో రెండు ఇళ్లల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. అంబాలకు చెందిన బోయిని శ్రీనివాస్, బోయిని ఐలుస్వామి తమ ఇళ్లల్లో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేసి ఉంచారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఇద్దరి ఇళ్లల్లో 15 క్వింటాళ్ల చొప్పున బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. ఈదాడుల్లో ఎస్సై వీరభద్రరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీబీ వలలో ఆర్టీసీ హుజూరాబాద్ డిపో మేనేజర్

- డ్రైవర్‌పై చార్జ్ మెమో ఎత్తేసేందుకు రూ.30వేలు డిమాండ్ చేసిన శ్రీకాంత్
- డబ్బులు ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు

ఎల్కతుర్తి: ఆర్టీసీ డ్రైవర్‌కు ఇచ్చిన చార్జ్ మెమో ఎత్తేసేందుకు రూ.30వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఈఘటన సోమవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వరంగల్ ఏసీబీ డీఎస్పీ పి.సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామానికి చెందిన తాటికొండ రవీందర్ కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఫిబ్రవరిలో రవీందర్ బంధువులు చనిపోతే ఒకరోజు విధులకు హాజరు కాలేదు. దీంతో డిపో మేనేజర్ శ్రీకాంత్.. సదరు డ్రైవర్‌కు చార్జ్ మెమో ఇచ్చాడు. మెమో ఎత్తివేయాలని రవీందర్ మొరపెట్టుకోగా రూ.30వేలు లంచం అడిగాడు. దీంతో రవీందర్ తన వద్ద ఉన్న రూ.10వేలు డిపో మేనేజర్‌కు ఇచ్చి మిగతా డబ్బులు త్వరలో ఇస్తానని చెప్పాడు. మిగతా డబ్బుల కోసం డిపో మేనేజర్ శ్రీకాంత్.. డ్రైవర్ రవీందర్‌ను ఇబ్బందులకు గురి చేయడం ప్రారంభించాడు. దీంతో విసిగిపోయిన డ్రైవర్ చివరికి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మేనేజర్ శ్రీకాంత్‌కు డ్రైవర్ రవీందర్ సోమవారం ఎల్కతుర్తి బస్టాండ్ వద్ద రూ.20వేలు ఇస్తుండగా.. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ రవీందర్ తెలిపారు. ఆయన వెంట ఇన్‌స్పెక్టర్లు శ్యాంసుందర్, రాజు తదితర సిబ్బంది ఉన్నారు.




లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీకాంత్ (కుర్చీలో కూర్చున్న వ్యక్తి)

డబుల్.. గుబుల్!

ఆరేళ్లుగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం పేదల నిరీక్షణ

- 8.12 ఎకరాలు.. 19 బ్లాకులు.. 608 ఇళ్లు
- అర్హులకు అందేనా?
- ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు
- పట్టించుకోని అధికారులు

కాజీపేట అర్బన్: పేదల సొంతింటి కల.. అలాగే మిగిలిపోతోంది. ఏళ్లుగా ఎదురు చూపులు తప్ప ప్రయోజనం లేకుండా పోతోంది. నగరానికి గుండెకాయవంటి కాజీపేట మండలం న్యూశాయంపేటలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిరుపయోగంగా మారాయి. సొంతింటి కల సాకారం కోసం నిరుపేదలు ఏడాదికోసారి దరఖాస్తు చేసుకుంటూనే ఉన్నారు. అయినా నేటికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ అడుగు ముందుకు పడడం లేదు. 2018లో గత ప్రభుత్వం ఇక్కడ డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పనులు రారంభించిన ఏడాదిలోపే నిర్మాణాల్ని పూర్తి చేసింది. అప్పటి నుంచి పేదలు తమకు ఇళ్లు కేటాయిస్తారని ఎదురుచూస్తూనే ఉన్నారు. అయినా ఇప్పటికీ ఇళ్ల పంపిణీ జరగలేదు.

అపరిశుభ్ర వాతావరణం..

న్యూశాయంపేటలోని డబుల్ బెడ్ రూమ్‌లను అర్హులకు కేటాయించకపోవడంతో.. ఇళ్ల చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. విష సర్పాలు, కీటకాలు, వీధి కుక్కలు, కోతులకు ఇవి స్థిర నివాసంగా మారాయి. కాగా.. న్యూశాయంపేటకు చెందిన 42 మంది దళితులకు చెందిన 8.12 ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించింది. తమకు డబుల్ బెడ్ రూమ్ కేటాయించాలని దళితులు కోర్టును ఆశ్రయించారు. వారికి అనుకూలంగా కోర్టు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ నేటికీ దళితులకు ఇళ్ల కేటాయింపు జరగలేదు.

8.12 ఎకరాల్లో..

న్యూశాయంపేటలోని 8.12 ఎకరాల విస్తీర్ణంలో 19 బ్లాకులుగా విభజించి 608 ఇండ్లను నిర్మించారు. 608 ఇళ్లకుగాను ఇప్పటికే వేల సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. అర్హులను ఎంపిక చేసి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించాలని నిరుపేదలు కోరుతున్నారు.



డబుల్ బెడ్రూమ్ ఇళ్ల ఆవరణలో పిచ్చి మొక్కలు

తక్షణమే పంపిణీ చేయాలి



న్యూశాయంపేటలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను తక్షణమే దరఖాస్తు చేసుకున్న అర్హులకు కేటాయించాలి. నిరుపేదలు, గుడిసెవాసులు దుర్భర జీవితం గడుపుతున్నారు. వారిని ఆదుకోవాలి.

\- పెరుగు సురేశ్, న్యూశాయంపేట

ప్రత్యామ్నాయ భూమిని కేటాయించాలి



మాకు ఒక్కొక్కరికి ఉన్న మేం సాగు చేసుకున్న ఏడు గుంటల భూమిని ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి తీసుకుంది. ప్రత్యామ్నాయ భూమిని కేటాయించడంతో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించాలి.

\- దండు దయాకర్, న్యూశాయంపేట

కోర్టు ఆదేశాల మేరకు ఇవ్వాలి..



మా భూమిని ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్‌ల నిర్మాణం కోసం స్వాధీనం చేసుకుంది. మేం కోర్టును ఆశ్రయించాం. భూమి కోల్పోయిన దళితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అందించాలని కోర్టు ఆదేశాలిచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు మాకు ఇళ్లను కేటాయించాలి.

\- కొట్టె శివ, న్యూశాయంపేట

పుష్పార్చన.. ప్రత్యేక పూజలు.. అలంకరణ





హన్మకొండ కల్చరల్/హన్మకొండ అర్బన్: వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా ఏడో రోజు సోమవారం భద్రకాళి దేవాలయంలో అమ్మవారికి లక్ష లిల్లీపూలతో పుష్పార్చన నిర్వహించారు. వేయిస్తంభాల ఆలయంలో సీతారాములకు ప్రత్యేక పూజలు జరిపారు. అదేవిధంగా ఉగాది ఉత్సవాల సందర్భంగా పద్మాక్షి అమ్మవారిని మల్లె (శ్వేతవర్ణ) పూలతో అలంకరించారు.

పూడికతీత పనులు చేపట్టండి

- కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- క్షేత్రస్థాయిలో తనిఖీ

వరంగల్ అర్బన్: నగర వ్యాప్తంగా ఉన్న నాలాల్లో పూడికతీత పనులు వేగంగా పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా సోమవారం హనుమకొండ పద్మాక్షి కాలనీ రోడ్ న్యూశ్యాయంపేట బొంది వాగు నాలా, రైల్వే ట్రాక్ అవతలి వైపు ప్రాంతం, వరంగల్ మేదరివాడ రైల్వే ట్రాక్ వెంట్స్ ప్రాంతం కీర్తి బార్ ఏరియా శాకరాసి కుంట, జన్మభూమి జంక్షన్, మైసయ్య నగర్, శివనగర్ శ్మశాన వాటిక, ఖిలా వరంగల్ ప్రాంతాల్లో కమిషనర్ పరిశీలించారు. ఈసందర్భంగా పద్మాక్షి కాలనీ శాయంపేట వద్ద కాంట్రాక్టర్ నిలిపేసిన స్మార్ట్ సిటీ రోడ్డు పనుల్ని వెంటనే చేపట్టాలని ఎస్‌ఈని ఆదేశించారు. బొంది వాగు నాలాను పరిశీలించి వరద ప్రభావం వల్ల ఎదురయ్యే సమస్యల్ని అధికారులను అడిగి తెలుసుకొని డీ సిల్టింగ్ ప్రక్రియ ప్రారంభించి నీటి ప్రవాహానికి అడ్డంకుల్లేకుండా చూడాలని పేర్కొన్నారు. కరీమాబాద్ కీర్తి బార్ నుంచి గవిచర్ల క్రాస్ రోడ్డు వరకు సుమారు 3 కిలో మీటర్ల మేర నిర్మిస్తున్న స్మార్ట్ రోడ్డు పనుల్లో జాప్యం తగదన్నారు. జన్మ భూమి జంక్షన్ సమీపంలో డ్రెయిన్‌లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని సీఎంహెచ్‌ఓను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌ఓ రాజేశ్, ఈఈ శ్రీనివాస్, డీఈలు రవికిరణ్, రంగారావు శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య ఏఈలు సతీశ్ హబీబ్ మొజామిల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాలాలను పరిశీలిస్తున్న కమిషనర్

నోడల్ అధికారుల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో నోడల్ అధికారుల పాత్ర కీలకమని వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా నోడల్ అధికారులతో ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఫిర్యాదుల పరిష్కారం, నామినేషన్ల స్వీకరణ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఎన్నికల విధులకు సంబంధించి ప్రతీ అంశంపై నోడల్ అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈసమావేశంలో డీఆర్‌ఓ శ్రీనివాస్, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, డీపీఓ కల్పన, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డాక్టర్ బాలకృష్ణ, పుష్పలత, సౌజన్య, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, విశ్వనారాయణ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీడియో బృందాలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ బృందాల పాత్ర కీలకమన్నారు. ఈ సమావేశంలో నోడల్ అధికారులు రాంరెడ్డి, సంజీవరెడ్డి, పుష్పలత, అధికారులు పాల్గొన్నారు.





ఎండలు మండే!

సూరీడు సుర్రుమంటున్నాడు. నెత్తి మీద నిప్పుల కుంపటి పోసినట్టు ఉదయం నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. అత్యవసరమైతే తప్ప జనాలు అడుగు బయటపెట్టడం లేదు. చెవులకు రుమాలు కట్టుకొని, నెత్తికి టోపీ పెట్టుకుని బయటకు వెళ్తున్నారు. మహిళలు, యువతులు తలకు స్కార్ఫ్‌లు చుట్టుకుని బయటకొస్తున్నారు. వేడికి తాళలేక కొందరైతే గొడుగులు వాడుతున్నారు. సోమవారం మధ్యాహ్నం పూట దారులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి.

\- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

భూ కబ్జాదారులపై సీపీ సీరియస్



వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరుగుతున్న భూ కబ్జాలపై పోలీస్ బాస్ సీరియస్ అయినట్లు సమాచారం. భూ కబ్జాలకు పాల్పడుతున్న అక్రమార్కుల జాబితాను తనకు పంపించాలని సోమవారం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఇటీవల పలు పోలీస్‌స్టేషన్లలో సంబంధిత అధికారులు భూముల పంచాయితీల వైపు మొగ్గు చూపడం వివాదంగా మారింది. ఆ కేసులు సీపీ అంబర్ కిషోర్ ఝా దృష్టికి రావడంతో స్టేషన్ల వారీగా పెండింగ్ భూ పంచాయితీల కేసుల వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. నగరంలోని కొన్ని పోలీస్‌స్టేషన్లలో ఇటీవల భూ కబ్జాదారులను అరెస్ట్ చేసి జైలుకు పంపించారు. వారి వివరాలను నివేదిక రూపంలో సీపీ పంపించినట్లు తెలిసింది. పేదల భూములను ఆక్రమిస్తున్న వారిపై రౌడీ షీట్‌తోపాటు పీడీ యాక్ట్ నమోదు చేసే అవకాశాలు ఉన్నాయి.

పేపర్‌లెస్ వర్క్ కోసం 'ఈ-ఆఫీస్'

నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్ క్యాంపస్‌లోని వివిధ కార్యాలయాల్లో పేపర్ రహితంగా కార్యక్రమాలు చేపట్టేందుకు పేపర్ లెస్ వర్క్‌కు ఈ-ఆఫీస్ తోడ్పడుతుందని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ తెలిపారు. నిట్ వరంగల్‌లోని బోస్ హాల్‌లో ఈ-ఆఫీస్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. భారత ప్రభుత్వ నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రేయిల్ టెల్ కార్పొరేషన్ సౌజన్యంతో సేవలందిస్తుందని తెలిపారు. ఈ-ఆఫీస్‌తో నిట్‌లోని కార్యక్రమాలు పారదర్శకంగా, వేగవంతంగా, ఖర్చు తగ్గిస్తూ, సరైన సమయంలో అందజేయడంతో పాటు పేపర్ రహితంగా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో నిట్ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఎన్వీ.ఉమామహేశ్, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సర్వీసెస్ సెంటర్ హెడ్, ప్రొఫెసర్ రష్మి రంజన్ రౌత్, రేయిల్ టెల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ జాయింట్ జనరల్ మేనేజర్ విక్రాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'లా' పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో ఐదేళ్ల లా కోర్సు మొదటి సెమిస్టర్ (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) పరీక్షలు ఈనెల 16 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక తెలిపారు. ఈనెల 16, 18, 20, 22 తేదీల్లో ఆయా పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయని వారు తెలిపారు. ఈనెల 16 నుంచి ఐదేళ్ల లా కోర్సు ఐదో సెమిస్టర్ పరీక్షలు కూడా జరుగుతాయని పేర్కొన్నారు. ఈనెల 16, 18, 20, 22, 24 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

పరకాల బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది బండెల స్వామి



బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండెల స్వామి, ప్రధాన కార్యదర్శి మేకల శ్రావణ్‌కుమార్

పరకాల: పరకాల బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది బండెల స్వామి ఎన్నికయ్యారు. గత నెల మార్చి 28న జరిగిన పరకాల బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్ష స్థానానికి బండెల స్వామి, పెండెల భద్రయ్య పోటీ పడగా.. ఇద్దరికి సమాన ఓట్లు 13-13 పోలయ్యాయి. దీంతో ఎన్నికల అధికారి ఓంటేరు రాజమౌళి అధ్యక్షుడి ఎంపికను వాయిదా వేసి తిరిగి సోమవారం టాస్ ద్వారా ఎంపికను నిర్ణయించారు. అయితే టాస్‌లో బండెల స్వామి విజేతగా నిలిచారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికయిన బండెల స్వామి ఆర్నెళ్ల పాటు కొనసాగిన తర్వాత పెండెల భద్రయ్య అధ్యక్షుడిగా కొనసాగుతారని ఎన్నికల అధికారి రాజమౌళి ప్రకటించారు. దీంతో 17 రోజులుగా.. బార్ అసోసియేషన్ ఎన్నికల ఉత్కంఠకు తెరపడినట్లు అయింది. ప్రధాన కార్యదర్శిగా మేకల శ్రావణ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా కూకట్ల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి పరకాల బార్ అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

నామినేషన్‌ల సమర్పణపై అవగాహన ఉండాలి

ఏఆర్‌ఓ, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు నామినేషన్‌ల దాఖలుపై అవగాహన కలిగి ఉండాలని వరంగల్ తూర్పు ఏఆర్‌ఓ, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో తూర్పు నియోజకవర్గ పరిధి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కమిషనర్ సమావేశమై పలు సూచనలు చేశారు. త్వరలో నిర్వహించనున్న వరంగల్ లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 18న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమై 25వ తేదీతో ముగుస్తుందన్నారు. నామినేషన్లను సూచించిన తేదీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల్లోగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ మహమ్మద్ ఇక్బాల్, నాగేశ్వరరావు వివిధ పార్టీల నాయకులు జన్ను అనిల్, బాకం హరిశంకర్, దాసరి రాజేశ్ పాల్గొన్నారు.

డివిజన్లకు ప్రత్యేకాధికారుల నియామకం

హనుమకొండలోని పలు డివిజన్లకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సోమవారం సాయంత్రం ఆదేశాలు జారీ చేశారు. వేసవి ప్రణాళిక, అమ్మ ఆదర్శ పాఠశాలల పర్యవేక్షణ తదితర అంశాలను అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.

జిల్లా స్థాయి అధికారి పేరు	డివిజన్లు
ఫిషరీస్ అధికారి విద్యాభారతి	1, 2, 3, 5, 6, 54
ఎంప్లాయ్‌మెంట్ అధికారి మల్లయ్య	7, 8, 9, 10, 30, 31
మైనార్టీ వెల్ఫేర్ అధికారి ఎం.శ్రీను	44, 45, 46, 47, 63, 64
ల్యాండ్ సర్వే ఏడీ ప్రభాకర్	48, 49, 50, 51, 52
లీగల్ మెట్రాలజీ అధికారి ప్రవీణ్‌కుమార్	53, 55, 56, 65, 66
ఇంటర్ ఎడ్యుకేషన్ అధికారి గోపాల్	57, 58, 59, 60, 61, 62

క్లుప్తంగా

వడదెబ్బతో మేకల కాపరి మృతి


కృష్ణమూర్తి (ఫైల్)

దంతాలపల్లి : వడదెబ్బతో మేకల కాపరి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. దంతాలపల్లికి చెందిన కన్నెబోయిన కృష్ణమూర్తి (60) వృత్తిరీత్యా మేకలు పెంచుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తనకున్న మేకలతో పాటు మరికొన్నింటిని కూలీకి కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 10 గంటల సమయంలో మేకలు మేపడానికి వెళ్లాడు. ఎండ తీవ్రంగా ఉండడంతో దాహం వేయగా నీరు కోసం అదే గ్రామానికి చెందిన ఓ రైతు పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ నీరు లభించలేదు. దీంతో అక్కడే ఓ చెట్టు కింది వెళ్లి పడిపోయాడు. మేకలు తన పొలంలో మేయడం గమనించిన రైతు సోమయ్య ఘటనాస్థలికి వెళ్లి చూడగా కృష్ణమూర్తి మృతి చెంది కనిపించాడు. దీంతో సోమయ్య వెంటనే గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులు, గ్రామస్తులకు విషయం తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ..


లక్ష్మి (ఫైల్)

టేకుమట్ల: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన ఓ మహిళ.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం రాత్రి టేకుమట్ల మండలం ద్వారకపేటలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కావటి లక్ష్మి(35) కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయంలో తరుచూ మనస్తాపానికి గురవుతోంది. ఈ క్రమంలో ఈ నెల 12న ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు చిట్యాల సివిల్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి లక్కం శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై అమరేందర్‌రెడ్డి సోమవారం తెలిపారు.

ఫోర్జరీ కేసు.. ముగ్గురి అరెస్ట్

కమలాపూర్: నకిలీ ఇంటి యాజమాన్య ధ్రువీకరణ పత్రం సృష్టించి పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసిన కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు కమలాపూర్ సీఐ ఈ.హరికృష్ణ సోమవారం తెలిపారు. సుమారు రెండు నెలల క్రితం కమలాపూర్ మండలం శనిగరం గ్రామానికి చెందిన బండి పరమేశ్వర్, బత్తినివానిపల్లికి చెందిన సంగ నవీన్, ఐనవోలుకు చెందిన గూడ రాజేష్.. శనిగరం గ్రామానికి చెందిన ఒక ఇంటి యాజమాన్య నకిలీ ధ్రువీకరణ పత్రం సృష్టించారు. ఆర్థికంగా లబ్ధి పొందాలనే ఉద్దేశంతో సదరు ధ్రువీకరణ పత్రంపై పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేశారు. ఈ విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి ప్రవళిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణ అనంతరం ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

క్రమబద్ధీకరణపై కనికరమేది?

- ఎన్‌హెచ్‌ఎంలో ఏళ్లుగా పని చేస్తున్నా రెగ్యులరైజ్ కాని ఉద్యోగుల సర్వీస్
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 502 మంది ఎంప్లాయీస్
- అన్ని కేడర్లకు 510 జీఓను వర్తింపజేయాలని డిమాండ్


సమస్యలు పరిష్కరించాలని డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు(ఫైల్)

గీసుకొండ: ప్రభుత్వ వైద్యారోగ్య విభాగం నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) స్కీమ్‌లో సేవలు అందజేస్తున్న ఉద్యోగులు సర్వీస్ పర సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఏళ్లుగా విధులు నిర్వర్తిసున్నా పర్మినెంట్ కావడం లేదు. నగరంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో వీరు అందించే వైద్య సేవలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. రాత్రింబవళ్లు వీరి సేవలను వినియోగించుకుంటున్న ప్రభుత్వం.. క్రమబద్ధీకరణ చేయడానికి మాత్రం ముందుకు రావడం లేదు. ఈ పథకంలో 24 సంవత్సరాల నుంచి విధులు నిర్వర్తిస్తున్న ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయకపోవడంతో కొందరు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా సర్వీస్ రెగ్యులరైజ్ అంశంపై తీవ్ర ఇబ్బందులు పడుతున్న వారిని మరో సమస్య వెంటాడుతోంది. గత నెల(మార్చి) జీతం అందకపోగా ఏడు నెలల పీఆర్సీ, ఎరియర్స్‌ను చెల్లించాల్సి ఉంది.

ఎన్‌హెచ్‌ఎంలో 502 మంది ఉద్యోగులు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 502 మంది హెల్త్ మిషన్ స్కీమ్‌లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నారు. అర్బన్ హెల్త్ సెంటర్లలో పీహెచ్‌ఎం అకౌంటెంట్లు, సపోర్టింగ్ స్టాఫ్, మెడికల్ అసిస్టెంట్లు, ఎంఎన్ఓ,వాచ్‌మెన్, స్వీపర్, బస్తీదవాఖానాలోని సపోర్టింగ్ స్టాఫ్, బ్లడ్ బ్యాంకు డీఈఓ, ల్యాబ్ అటెండర్, ఎస్ఎన్‌సీయూ డీఈఓ సెక్యూరిటీ గార్డులు, ఓటీ టెక్నీషియన్, టీ-హబ్ డీఈఓ, సపోర్టింగ్ స్టాఫ్, పీహెచ్‌సీ డీఈఓ కాంటిజెంట్ వర్కర్లు, డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌లో డెంటల్ టెక్నీషియన్, సోషల్ వర్కర్, ఎంసీహెచ్‌ఓటీ అసిస్టెంట్, సెక్యూరిటీ గార్డు, సపోర్టింగ్ స్టాఫ్, ఆయుష్ ఎస్ఎన్ఓ, ఎఫ్ఎన్ఓ, ఎంసీహెచ్ సెక్యూరిటీ గార్డులు, వాచ్‌మెన్లు, ఎస్‌టీఎల్ఎస్ టీబీ లెప్రసీ వింగ్ సూపర్‌వైజర్లతో పాటు పలు కేటగిరీలకు చెందిన వారు హెల్త్ మిషన్ స్కీమ్‌లో సేవలు అందిస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఎన్‌హెచ్‌ఎం స్కీమ్‌లో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న వారి సర్వీస్‌ను ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలి. 510 జీఓను అన్ని కేడర్లకు వర్తింపజేసి న్యాయం చేయాలి.

– రామ రాజేశ్‌ఖన్నా, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఉద్యోగుల ప్రధాన సమస్యలు

- ఎన్‌హెచ్‌ఎం స్కీమ్‌లో పని చేస్తున్న అన్ని కేడర్ల వారి సర్వీస్‌లు రెగ్యులర్ చేయాలి.
- నెలనెలా సకాలంలో వేతనాలు చెల్లించాలి.
- గత బీఆర్ఎస్ సర్కారు జారీ చేసిన 510 జీఓ ద్వారా కొన్ని కేడర్ల వారికే మేలు జరిగింది. అన్ని కేడర్ల వారికి వర్తించకపోవడంతో సుమారు రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల మందికి అన్యాయం జరిగింది. ఈ జీఓను అందరికీ వర్తించేలా చర్యలు తీసుకోవాలి.
- సమాన పనికి సమాన వేతనం కింద రెగ్యులర్ ఉద్యోగుల తరహాలో జీతభత్యాలు(బేసిక్‌పే) చెల్లించాలి.
- మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలి.
- కేంద్రం నుంచి 60, రాష్ట్రం నుంచి 40 శాతం నిధులు ప్రతీ నాలుగు నెలలకు మంజూరు కావాల్సి ఉంది. అయితే నిధుల మంజూరు సరిగా లేకపోవడంతో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు జీతభత్యాలు సకాలంలో అందని పరిస్థితి నెలకొంది.

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

- సైబర్ క్రైం ఏసీపీ విజయ్ కుమార్


మాట్లాడుతున్న సైబర్ క్రైం ఏసీపీ విజయ్ కుమార్

హన్మకొండ: బాలలు ఆన్‌లైన్‌లో లైంగికదాడులకు గురికాకుండా ఉండడానికి తల్లిదండ్రులకు అవగాహన ఉండాలని సైబర్ క్రైం ఏసీపీ విజయ్ కుమార్ అన్నారు. సోమవారం హనుమకొండ సుబేదారిలోని 'అసుంత' భవన్‌లో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో 'ఆన్‌లైన్ వేధింపుల నుంచి బాలల సంరక్షణ–తల్లిదండ్రుల పాత్ర' అనే అంశంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంరక్షకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఏసీపీ విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో తెలిసిన (పరిచయస్తులు) వారు మాత్రమే ఎక్కువ బాలలపై లైంగిక దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఈ విషయంలో పిల్లలు అప్రమత్తంగా ఉండేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. పిల్లలతో స్నేహపూర్వకంగా ఉంటూ ఆన్‌లైన్‌లో వారు చేస్తున్న కార్యకలాపాలను తరచూ గమనిస్తూ ఉండాలన్నారు. పిల్లలు ఏదైనా వేధింపులకు గురైనట్లు అనిపిస్తే శిక్షించకుండా వారిని సంరక్షించాలన్నారు. అంతేకాకుండా ప్రస్తుత సమాజంలో వయసుతో సంబంధం లేకుండా పురుషులు, మహిళలు సైబర్ క్రైమ్ ద్వారా ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఇలాంటి ఘటనలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం ముఖ్య రిసోర్స్ పర్సన్, మైచాయిసెస్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ జన్ను క్రాంతి.. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంరక్షకులకు మానవక్రమ రవాణా రూపాలు, బాలలు ఆన్‌లైన్‌లో ఏ విధంగా వేధింపులకు గురవుతున్నారు.. వారిని ఏ విధంగా సంరక్షించాలనే అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ కానిస్టేబుల్ బి.కిశోర్ కుమార్, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ కోఆర్డినేటర్ బత్తుల కరుణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎర్ర శ్రీకాంత్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు పరికి సుధాకర్, సింగారపు భాస్కర్, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ ఇసంపల్లి సుదర్శన్, ఆఫీస్ మేనేజర్ అజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి పట్టిన పీడ 'కడియం'

- వెన్నుపోటు, బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు కేరాఫ్ ఆయనే..
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య ఘాటు వ్యాఖ్యలు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ నియోజకవర్గానికి పట్టిన పీడ కడియం శ్రీహరి అని, వెన్నుపోటు, బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు కేరాఫ్ అని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. డివిజన్ కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ద్రోహి అని, అధికార దాహంతో ఉద్యమ నేత, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన కడియంను ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. మొదట ఎన్టీఆర్ హయాంలో టీడీపీలో చేరి మంత్రి పదవులు అనుభవించి ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి చంద్రబాబు పంచన చేరాడని, అనంతరం పలు మంత్రిత్వ శాఖలు చేసి బాబును మోసం చేసి కేసీఆర్ పంచన చేరాడన్నారు. మాదిగలకు ఒక్క ఎంపీ టికెట్ ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ మాదిగలను దగా చేసిందన్నారు. ఇప్పటికే కావ్య కులంపై, మతాంతర వివాహంపై రచ్చ జరుగుతుందని, నైతికంగా ఓడిపోయిందని, ప్రజల్లో మూడో స్థానంలో ఉందన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం తీసుకువచ్చేలా పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేష్, నాయకులు చల్లా చందర్‌రెడ్డి, ఆకుల కుమార్, అక్కినపెల్లి బాలరాజు, తాటికొండ సురేష్‌కుమార్, కనకం గణేష్, మహేందర్‌రెడ్డి, పొన్నం రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- హైదరాబాద్ దుండిగల్‌లో ఘటన..
- మృతుడు ఎన్పీడీసీఎల్ మాజీ సీఎండీ గోపాల్ రావు మనవడు


మేఘాంశ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే


మేఘాంశ్ (ఫైల్)

హన్మకొండ: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడి మృతి చెందాడు. ఈ ఘటన హైదరాబాద్‌లోని దుండిగల్ సమీపంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా సీడబ్ల్యూసీ చైర్మన్ అన్నమనేని అనిల్ చందర్ రావు ఏకైక కుమారుడు మేఘాంశ్(21) హైదరాబాద్ టెక్ మహేంద్ర వర్సిటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి స్నేహితులతో కలిసి కారులో ప్రయాణిస్తుండగా దుండిగల్ సమీపంలోని ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు దగ్గర అతివేగంగా వెళ్తూ పూలే విగ్రహాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మేఘాంశ్ అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురు స్నేహితులకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా, మేఘాంశ్ మృతదేహాన్ని సోమవారం హనుమకొండ విద్యుత్ నగర్‌లోని స్వగృహానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, మృతుడు టీఎస్ ఎన్పీడీసీఎల్ మాజీ సీఎండీ అన్నమనేని గోపాల్ రావుకు మనవడు. మాజీ మేయర్, బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ టి.రాజేశ్వర్ రావు, టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, సదర్‌లాల్, వి.మోహన్ రావు, వి.తిరుపతి రెడ్డి, సీజీఎంలు, జీఎంలు.. మాజీ సీఎండీ అన్నమనేని గోపాల్ రావు, కుంటబ సభ్యులను పరామర్శించారు.

మేఘాంశ్‌కు ఎమ్మెల్యే నాగరాజు నివాళి

మేఘాంశ్ మృతదేహాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు సోమవారం సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ కోఆర్డినేటర్ కుందూరు వెంకటరెడ్డి, అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్ రావు, టీపీసీసీ మాజీ జనరల్ సెక్రటరీ మార్నేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీకి పాముకాటు


చికిత్స పొందుతున్న శాంతమ్మ

వెంకటాపురం(కె): మండలంలోని ముకునూరు పాలెం గ్రామ సమీపంలో ఓ ఉపాధి హామీ కూలీ పాముకాటుకు గురైంది. గ్రామానికి చెందిన మీడియం శాంతమ్మ సోమవారం ఉపాధి హామీ పనులకు వెళ్లింది. పనులు ముగించుకుని ఇంటికి వచ్చే క్రమంలో పాముకాటుకు గురైంది. గమనించిన గ్రామస్తులు పామును చంపి మహిళతో పాటు వెంకటాపురం వైద్యశాలకు తీసుకొచ్చారు. అక్కడ వైద్యులు శాంతమ్మకు చికిత్స నిర్వహించారు. గ్రామస్తులు సకాలంలో శాంతమ్మను ఆసుపత్రికి తరలించగా ఆమెకు ప్రాణాపాయం తప్పింది.

పసికందు మృతదేహం లభ్యం

ఎల్కతుర్తి: మండలంలోని గోపాల్‌పూర్ చెరువులో అమానవీయ ఘటన చోటు చేసుకుంది. జన్మించిన మూడు, నాలుగు రోజులకే ఓ పసికందును (బాలుడు) చెరువులో పడేశారు. సోమవారం ఆ చిన్నారి మృతదేహం తేలగా.. ఈ ఘటన చూసిన స్థానికులు తీవ్రంగా కలతచెందారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్ చెరువులో ఓ పసికందు మృతదేహం తేలియాడింది. దీనిని గమనించిన స్థానికులు.. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై రాజ్‌కుమార్ హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. చిన్నారి గురించి గ్రామంలో ఆరా తీసినా వివరాలు తెలియలేదు. బాలుడు జన్మించిన తర్వాత మృతి చెందితే చెరువులో పడేశారా..? లేదా ప్రాణం ఉండగానే చెరువులో పడేశారా? అనే విషయం తెలియాల్సి ఉంది. కాగా, బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

- రూ. 5వేల జరిమానా

వరంగల్ లీగల్/మడికొండ: పాతకక్షల నేపథ్యంలో ఒకరిని హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.కృష్ణమూర్తి సోమవారం తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.సత్యనారాయణగౌడ్, మడికొండ పోలీసుల కథనం ప్రకారం.. కాజీపేట మండల రాంపేట గ్రామానికి చెందిన దాడబోయిన శంకరయ్యకు తన చిన్నాన్న కుటుంబంతో భూ సంబంధ వివాదం ఉంది. ఈ వివాదంలో గ్రామపెద్ద మనిషిగా వ్యవహరించే అలువుల సమ్మయ్య ప్రత్యర్థులతో కలిసి తనకు అన్యాయం చేశాడని శంకరయ్య ద్వేషం పెంచుకున్నాడు. అలాగే, గ్రామంలో తన జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకున్న వాటర్ ప్లాంట్‌కు కూడా ఆటంకం కల్పించాడని, గతంలో ఇరువురు పరస్పరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకోగా కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ క్రమంలో సమ్మయ్య వల్ల తనకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, అడ్డుతొలగించుకుంటే తప్పా తనకు ప్రశాంతత లేదని భావించిన శంకరయ్య.. సమ్మయ్య హత్యకు పథకం రచించాడు. ఇందులో భాగంగా 2021 జూలై 10వ తేదీన సమ్మయ్య తన మనవడు సుప్రీత్, గ్రామస్తుడు వీరారెడ్డితో కలిసి వాకింగ్ కోసం మైసమ్మ కుంట వద్దకు వెళ్లాడు. అక్కడ యోగా చేస్తుండగా సమ్మయ్యను శంకరయ్య గొడ్డలితో నరికి చంపి పరారయ్యాడు. వీరారెడ్డి ద్వారా విషయం తెలుసుకున్న కుటుంబీకులు హుటాహుటిన ఘటనా స్థలికి వెళ్లిచూడగా సమ్మయ్య మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు మడికొండ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. విచారణలో సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు.. నేరం రుజువుకావడంతో నేరస్తుడు దాడబోయిన శంకరయ్యకు జీవిత ఖైదు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ జడ్జి ఎం.కృష్ణమూర్తి తీర్పు వెల్లడించారు. కేసు సీఐ రవికుమార్, ఎస్సై ప్రతాప్ పరిశోధించగా, ఏఎస్సై కె.పరమేశ్వరి, కానిస్టేబుల్ వి.రాజేష్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.

పీపీకి కృతజ్ఞతలు తెలిపిన బాధితులు..

ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వ్యవహరించిన డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మోకాళ్ల సత్యనారాయణగౌడ్‌కు మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సాక్షులకు మనోధైర్యం కల్పించి వారిని కోర్టులో ప్రవేశపెట్టి నిందితుడికి శిక్ష పడేలా వాదించిన సత్యనారాయణగౌడ్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు. వీరితో పాటు కేసు విషయంలో బాధ్యత వహించిన పోలీస్ అధికారులకు కూడా ధన్యవాదాలు తెలిపారు.

ఈ సీజన్‌లో అత్యధిక మిర్చి

- ఏనుమాముల మార్కెట్‌కు 1.30 లక్షల బస్తాలు
- బంద్‌ల ఎఫెక్ట్ కారణం..
- కోల్డ్ స్టోరేజీల్లో స్థలం లేక రైతుల ఇబ్బందులు
- ఎండలతో తూకాలు ఆలస్యం


వరంగల్ మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి

వరంగల్ : వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ఈ సీజన్‌లోనే అత్యధికంగా లక్షా 30 వేలకు పైగా మిర్చి బస్తాలు వచ్చాయి. ఈ నెలలో రంజాన్, ఉగాది పండుగలు రావడంతో గడిచిన 15 రోజుల్లో కేవలం 6 రోజులు మాత్రమే క్రయవిక్రయాలు జరిగాయి. దీంతో సోమవారం భారీగా మిర్చిని రైతులు మార్కెట్‌లో అమ్మేందుకు వచ్చారు. రెండో కోత పూర్తి కావడంతో రైతులు పూర్తిస్థాయిలో సరుకు మార్కెట్‌కు తరలిస్తున్నారు. పెద్ద ఎత్తున మిర్చి రావడంతో ధరలు పడిపోతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. మార్కెట్ పరిధిలోని కోల్డ్ స్టోరేజీలు అన్ని నిండుకోవడంతో తక్కువ ధరలకు అమ్మని రైతులకు ఛాన్స్ లేకుండాపోయింది. దీంతో చిన్న, సన్నకారు రైతులు ఏదో ఒక ధరలకు విక్రయిస్తూ ఇంటిబాట పట్టారు. ఎక్కువ బస్తాలతో పాటు ఆర్థికంగా ఉన్న రైతులు ఖమ్మం తదితర ప్రాంతాల్లో ఉన్న కోల్డ్ స్టోరేజీలకు సరుకులను తరలిస్తున్నారు. తేజ రకం మిర్చి ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.18,300, కనిష్ఠంగా రూ.14,500, యూఎస్–341 రకం గరిష్ఠంగా రూ.15,500, కనిష్ఠంగా రూ.10,500 పలికింది. అదే విధంగా వండర్‌హాట్ క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.15వేలు, కనిష్ఠంగా రూ.11వేలు పలికింది. విపరీతమైన ఎండలతో ఉష్ణోగ్రతలు పెరగడం, భారీగా బస్తాలు రావడంతో మార్కెట్ యార్డుల్లోని కార్మికులు, దడవాయి, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండ వేడిమి వల్ల కాంటాలు వేయడంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. యార్డుల వద్ద తాగునీటి వసతి ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ఎండ వేడిమి తాళలేక చెట్ల కింద సేదతీరారు. సోమవారం రాత్రి వరకు సుమారు 60–70 వేల బస్తాల వరకే కాంటాలు జరుగుతాయని, మిగతా వాటికి మంగళవారం పెడతామని మార్కెట్ సిబ్బంది తెలిపింది. మంగళవారం సైతం పెద్ద ఎత్తున వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌లో ఆటాపాట

స్టెప్పులేసిన అధికార పార్టీ ప్రజాప్రతినిధి భర్త

- వీడియో తీసి ఎంజాయ్ చేసిన పోలీసులు
- ఎస్పీ కిరణ్ ఖరే కన్నెర్ర.. హెడ్‌కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు
- ఎస్సై, ఒక హెడ్ కానిస్టేబుల్, ఆరుగురు కానిస్టేబుళ్ల బదిలీ


పీఎస్‌లో స్టెప్పులేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు భర్త శ్రీనివాస్

భూపాలపల్లి: 'వేసవి కాలం వెన్నెల్లాగా... ఓరోరి అందగాడా.. నీ కోసం నీ కోసం..' అంటూ సినిమా పాటకు అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి భర్త ఏకంగా పోలీస్‌స్టేషన్‌లోనే స్టెప్పులేశాడు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం.. విషయం తెలిసిన పోలీస్ ఉన్నతాధికారులు ఏకంగా ఎస్సైతోపాటు ఎనిమిది మంది సిబ్బందిపై చర్యలు తీసుకున్నారు. సంచలనంగా మారిన ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవ్‌పూర్ ఠాణాలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన మహదేవ్‌పూర్ జెడ్పీటీసీ సభ్యురాలు గుడాల అరుణ భర్త శ్రీనివాస్ సోమవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్లాడు. అక్కడ సిబ్బందితో ముచ్చటించిన అనంతరం వారు సౌండ్ బాక్స్ ఏర్పాటు చేయగా సినిమా పాటకు డ్యాన్స్ చేశారు. అతను స్టెప్పులు వేస్తున్న సమయంలో.. అబ్బ ఏం చేస్తున్నాడన్నా.. భలే చేస్తున్నావన్నా.. అంటూ పోలీస్ సిబ్బంది పొగుడుతూ మొత్తం వీడియో తీశారు. శ్రీనివాస్ కొద్దిసేపటి అనంతరం సోషల్ మీడియాలో ఓ పోస్టును విడుదల చేశారు. తాను సామాజిక స్పృహ ఉన్న వ్యక్తినని, పోలీసులు నిరంతరం పని చేస్తున్నందున, ఎటువంటి అనారోగ్య సమస్యలకు గురి కాకుండా ఉండాలనేది తన ఉద్దేశమన్నారు. ఒత్తిడి లేకుండా ఎలా ఉండాలి అనే విషయాలు చెప్పి, ఏదో ఒక వ్యాయామం చేసి శరీరంలోని మలినాలను తొలగించుకునేలా చూడాలని పోలీసు సిబ్బందికి చెప్పినట్లు వెల్లడించారు. దీంతోపాటు స్టేషన్‌లో వేసిన డాన్స్ వీడియోను కూడా పోస్ట్ చేశారు.

ఎస్పీ కిరణ్ ఖరే సీరియస్..

మహదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకున్న సంఘటనపై ఎస్పీ కిరణ్ ఖరే సీరియస్ అయ్యారు. ప్రజాప్రతినిధి భర్త శ్రీనివాస్ డ్యాన్స్ చేసిన సంఘటనే కాకుండా స్థానిక పోలీస్ సిబ్బందిపై కొద్ది రోజులుగా ఆరోపణలు వస్తున్నాయి. నిఘా విభాగానికి చెందిన ఓ కానిస్టేబుల్ బహిరంగ ప్రదేశంలో కల్లు తాగిన వీడియో ఆదివారం వైరల్ అయింది. అంతేకాక పలు దందాల్లో సిబ్బంది చేతివాటం ఉంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు విచారణ చేపట్టిన ఎస్పీ జిల్లాలో ఎన్నడూ లేని రీతిలో స్టేషన్‌లో పనిచేసే 9 మందిపై చర్యలు తీసుకున్నారు. ప్రజాప్రతినిధి భర్త పోలీస్‌స్టేషన్‌లో డ్యాన్స్ వేసిన చర్యకుగాను ఎస్‌హెచ్ఓ ప్రసాద్‌ను వీఆర్ (వేకెన్సీ రిజర్వ్)కు బదిలీ చేయగా, హెడ్ కానిస్టేబుల్ సోయం శ్రీనివాస్ ను సస్పెండ్ చేశారు. అలాగే, ఆ కారణంతో పాటు వివిధ ఆరోపణలు ఎదుర్కొంటున్న హెడ్‌కానిస్టేబుల్ ఉపేందర్, మరో ఆరుగురు కానిస్టేబుళ్లను వివిధ పోలీస్‌స్టేషన్‌లకు బదిలీ చేశారు.

మావోయిస్టు సంతోష్‌కు ఘన నివాళి


సంతోష్‌కు నివాళులర్పిస్తున్న పలు సంఘాల నాయకులు

కాటారం: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పూజార్ కాంకేర్ అటవీ ప్రాంతంలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు అన్నె సంతోష్ అలియాస్ సాగర్‌కు సోమవారం అమరుల బంధుమిత్రుల కమిటీ ఆధ్వర్యంలో అశ్రు నివాళులర్పించారు. కాటారం మండలం అంకుషాపూర్ గ్రామ పంచాయతీ పరిధి దస్తగిరిపల్లిలోని తన నివాసంలో సంతోష్ స్మారక స్థూపం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంతోష్ విప్లవ జీవితంపై పాటలు పాడారు. కార్యక్రమంలో బంధుమిత్రుల కమిటీ అధ్యక్షురాలు అంజమ్మ, ప్రధాన కార్యదర్శి పద్మకుమారి, ట్రెజరర్ శాంత, పౌరహక్కుల సంఘం నాయకులు లక్ష్మణ్‌నారాయణ, విరసం నేత రాజన్న, తదితరులు పాల్గొన్నారు.